




# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు ‘ఫన్‘నీరు

కాంగ్రెస్ వాళ్ళేంటి వరుణుడు మా పార్టీ వాడే అంటున్నారు? అందరినీ ముంచు తాడనా?

*ముంచనూ వచ్చు..నీళ్ళు కార్చనూ వచ్చు..!*

దుష్యంతుడు శకుంతలను నిజంగా మరిచాడా లేక కావాలని అలా నటించాడా?

*భారతంలో మొట్ట మొదటిహీరో దుష్యంతుడు కదా...ఎలాగైనా యాక్షన్ చెయ్యగలడు .!*

కనీసం రెండు పెళ్ళిళ్ళకి అనుమతి ఇచ్చేలా హిందూ వివాహచట్టాన్ని సవరిస్తే ఎలా ఉంటుందంటారు?

*భయంకరమైన నేరం చేసిన వాళ్ళెవరికైనా ఉరిశిక్ష బదులు రెండు పెళ్ళిళ్ళ శిక్ష వేయడానికివీలౌతుంది..!*

అక్కడెక్కడో పదిహేనేళ్ళ కుర్రాడు సిజేరియన్ ఆపరేషన్ చేశాట్ట..హౌరా?

*ఆపరేషన్ దుర్యోధన కన్నా ఎక్కువ పరేషాన్.*

మొన్నామధ్య హైదరాబాదు వచ్చినప్పుడు బార్ లో సిగిరెట్లు తాగే అమ్మాయిల్ని చూసి, మనరాష్ట్రం ఎంత దూసుకుపోతోందో తెలుసుకున్నాను.. ఇంకా ఎంత ముందుకి వెళుతుందో ఏమైనా అంచనా వెయ్యగలరా?

*పొగ ‘రెట్టించుకు ‘ పోయే వరకూ.!*

టి.వి. సీరియల్స్ లో ఆడ విలన్ల దౌర్జన్యాలు ఆగేదెప్పుడు?

*హీరో ‘ఇన్‘ ఐనప్పుడు లేదా మగ విలన్లు రచయితలమీద దాడి చేసినప్పుడు..!*

మరో కొన్ని దశాబ్దాల్లో తెలుగు భాష అంతరించి పోతుందని కొంతమంది అంచనా..మరి మీ హాస్యావధాన చరిత్ర ముందు తరాలకితెలిసేదెలా?

*తేట తెలుగు తగ్గినా ‘తాట ‘ తెలుగు నిలిచే ఉంటుందని నాధీమా..!*

హీరోగారి భార్య ఇంట్లోకి రాగానే హీరో ఇల్లు వొదిలి పరారీ అయ్యాట్ట.. .. మరి హీరోయిజం ఏమైందో?

*అక్కడా, ఇక్కడా యాక్షన్ ఎక్కువైతే రియాక్షన్ అంతే మరి..!*

క్షౌరశాలల బోర్డులపై పన్ను కట్టమంటోందట మనప్రభుత్వం. ..మీరేమంటారు?

*'ఏడ్చినా నవ్వినా కన్నీళ్ళే ' అన్నట్లు కట్టినా కట్టక పోయినా అంతా క్షవరమే కదా..!*

ఈ పాల్ గారి కార్యకలాపాల గురించి మీ కేమైనా ఉప్పు అందిందా?

*'రాజా ' వారు 'పాలు ' పంచుకున్నప్పుడే అసలు సమస్య..*

ఇటీవల అమెరికా వచ్చిన మొదటిరోజే చంద్రబాబునాయుడు గారు, తన పర్యటన రాజకీయాలకి దూరం అని చెప్పారట..దీని భావమేమి తిరుమలేశా?

*నిజమే.. అక్కడ ఆయన 'రాజా 'కీయాలకు దూరమే కదా..*



చిలిపి ప్రశ్నలకి హాస్యబ్రహ్మ, హాస్యావధాని శంకరనారాయణగారి నుంచీ కొంటె సమాధానాలు తెలుసుకోవాలని ఉందా!? ఇంకా ఆలశ్యమెందుకు.. మీ చిలిపి ప్రశ్నల్ని **editor@koumudi.net** కి వెంటనే పంపించండి..!!